## ట్రాక్టర్ ఢీకొని ఒకరి మృతి


మధుకర్ (ఫైల్)

హాజీపూర్, మే 15 : మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని ముల్కల్ల గ్రామ శివారులో గురువారం ఉదయం బైక్‌ను ట్రాక్టర్ ఢీకొనడంతో ఒకరు మృతి చెందారు. హాజీపూర్ ఎస్ఐ స్వరూప్ రాజ్ తెలిపిన వివరాల ప్రకారం కార్పొరేషన్ పరిధిలోని గుడిపేటకు చెందిన బయ్య మధుకర్(31) గురువారం ఉదయం మంచిర్యాలలో పాలు పోసేందుకు బైక్ వెళ్తున్నాడు. ముల్కల్ల గ్రామ శివారులో జాతీయ రహదారిపై రాంగ్ రూట్‌లో అతి వేగంగా వచ్చిన ట్రాక్టర్ ఢీనడంతో బైక్ ఉన్న మధుకర్ తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు అక్కడికి చేరుకొని ట్రాక్టర్‌ను ఇసుక రీచ్ వద్ద గుర్తించి పట్టుకున్నారు. మధుకర్‌కు రెండేళ్ల కూతురు శాన్విత, భార్య మౌనిక ఉన్నారు. తండ్రి బయ్య సత్తయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## కారు-బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఒకరికి గాయాలు

జన్నారం, మే 15 : మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయ సమీపంలో గల ప్రధాన రోడ్డుపైన కారు-బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఉట్నూర్ మండలం బీసాయిపేటుకు చెందిన రవికి తీవ్ర గాయాలైనట్లు ఎస్ఐ రాజవర్ధన్ తెలిపారు. 108 అంబులెన్స్‌లో లక్షెట్టిపేట ప్రభుత్వ దవాఖానాకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

## పరారైన దొంగ అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న సీఐ అల్లం నరేందర్

లక్షెట్టిపేట, మే 15: పట్టణంలో రెండు రోజుల క్రితం నస్పూర్ పోలీస్ స్టేషన్లో దొంగతనం కేసులో అరెస్టయి రిమాండ్‌కు తరలిస్తున్న రాంమల్లే గజానంద్ అనే దొంగను పట్టుకొని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ అల్లం నరేందర్ గురువారం తెలిపారు. మావల మండలానికి చెందిన గజానంద్ వ్యసనాలకు బానిసై దొంగతనాలు చేస్తూ నస్పూర్ పోలీసులకు పట్టుబడ్డాడు. అక్కడి పోలీసులు కేసు నమోదు చేసి రెండు రోజుల క్రితం లక్షెట్టిపేట జైలుకు తీసుకురాగా పోలీసుల నుంచి తప్పించుకొని పారిపోయాడన్నారు. గురువారం బస్టాండ్ సమీపంలో గాలిస్తుండగా ఎస్ఐ గోపతి సురేశ్ సిబ్బంది కలిసి పట్టుకొని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

**PASSPORT LOST**

నేను దాసరి వినయ్‌కుమార్ తండ్రి సత్తయ్య, ని॥ రేవోజీపేట్ గ్రామము, మం॥ దస్తురాబాద్, జిల్లా: నిర్మల్, T.S., నా యొక్క పాస్‌పోర్ట్ నెంబర్ S0713614 తేది: 25-02-2025 రోజున రేవోజీపేట్ నుండి దస్తురాబాద్‌కు బైక్ పై ప్రయాణిస్తుండగా ఎక్కడో పడిపోయినది. దొరికినవారు సంప్రదించు సెల్ నెంబర్ : 95506 66447.

**DOCUMENTS LOST**

నా పేరు వరగంటి ప్రవీణ్ తండ్రి వరగంటి అశోక్, ని॥ అకోలి గ్రామము, మం॥జైనాథ్, జి॥ ఆదిలాబాద్. నా యొక్క ప్లాటు ఒరిజినల్ డాక్యుమెంట్ నెంబర్ 3146/2025 రిజిష్టర్ JSRO ఆదిలాబాద్ అయితే దానికి సంబంధించిన లింక్ డాక్యుమెంట్ నెం. 7482/2011 తేది: 08.05.2025 రోజు ఉదయం పిట్లలవాడ నుండి దస్నాపూర్‌కు ఆటోలో ప్రయాణించగా ఎక్కడో పడిపోయినది. ఎవరికైన దొరికినచో సంప్రదించు సెల్ నెం. 80743 68554, 9440012163,

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677

## సన్న రకం వడ్లను షరతులు లేకుండా కొనాలి

చెన్నూర్ రూరల్, మే 15: ప్రభుత్వం రూ.500 బోనస్ ఇస్తామంటే రైతులు పండించిన సన్న రకం ధాన్యాన్ని ఎలాంటి షరతులు లేకుండా బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చెన్నూర్ మండలంలోని కిష్టంపేటలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను స్థానిక నాయకులతో కలిసి సందర్శించారు. అకాల వర్షానికి ధాన్యం తడుస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం సిగ్గు చేటన్నారు. సన్న రకం ధాన్యంలో తరుగు పేరిట 16 కిలోల వరకు కటింగ్ చేయడం తగదన్నారు. రైతులు ఇబ్బంది ఎమ్మెల్యే వివేక్ ఎక్కడ ఉన్నారని మండిపడ్డారు.

## విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలి


ఎస్ఈ గంగాధర్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

చెన్నూర్ రూరల్, మే 15 : చెన్నూర్ మండలంలో విద్యుత్ వినియోగదారులు విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలని విద్యుత్ శాఖ ఎస్ఈ గంగాధర్ అన్నారు. చెన్నూర్ మండలంలోని కొమ్మెర, ఆస్నాద్, రచ్చపల్లి సబ్‌స్టేషన్లను ఆయన గురువారం సందర్శించారు. కొమ్మెర సబ్‌స్టేషన్‌లో ఇప్పుడున్న 8 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ తొలగించి ఏర్పాటు చేసిన 8ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆయన ప్రారంభించారు. బావులు, బోరు మోటర్ల వద్ద రైతులు కెపాసిటర్లను అమర్చుకోవాలని తెలిపారు. రచ్చపల్లి సబ్ స్టేషన్‌లో బీరెల్లి పొక్కూర్‌కు ఒకే బ్రేకర్ ఉండడంతో సమస్యలు ఏర్పడుతున్నాయని, బీరెల్లి 11 కేవీకి ఏర్పాటు చేసిన ప్రత్యేక పీడర్‌ను ప్రారంభించారు. విద్యుత్ సిబ్బంది గ్రామస్తులకు అందుబాటులో ఉండాలని తెలిపారు. అనంతరం ఆస్నాద్ సబ్‌స్టేషన్‌లో ఎస్ఈ, డీఈ, ఏఈలను మాజీ ప్రజాప్రతినిధులు, రైతులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీఈ ఖైసర్, ఏఈ శ్రీనివాస్, లైన్‌మెన్లు రమేశ్ రెడ్డి, కలగూర రాయమల్లు, బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## పోడు రైతులకు న్యాయం చేయాలి


తాండూర్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కొత్తపల్లి గ్రామస్తులు

తాండూర్, మే 15 : పోడు రైతులకు ప్రభుత్వం న్యాయం చేయాలని కోరుతూ గురువారం తాండూర్ తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్‌కు మండలంలోని కొత్తపల్లికి చెందిన పోడు రైతులు మాజీ ఎంపీటీసీ సూరం రవీందర్ రెడ్డి నేతృత్వంలో వినతిపత్రం అందజేశారు. 30 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న రైతుల భూమిలో ఫారెస్ట్ అధికారులు కొత్తపల్లికి వచ్చి ఈ భూములు ఫారెస్ట్ భూములని ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు. తమ భూముల్లో సాగు ఎలాంటి నిర్బంధం లేకుండా చూడాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో భూమి సాగు చేసుకుంటున్న రైతులు, గ్రామస్తులు ఉన్నారు.

## నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

- భీమిని వ్యవసాయ సహాయ సంచాలకురాలు సురేఖ


అవగాహన కల్పిస్తున్న ఏడీఏ సురేఖ

నెన్నెల, మే 15 : నకిలీ పత్తి విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని భీమిని వ్యవసాయ సహాయ సంచాలకులు సురేఖ హెచ్చరించారు. గురువారం డివిజన్ స్థాయిలో నెన్నెల, కన్నెపల్లి, భీమిని, వేమనపల్లి మండలంలోని వ్యవసాయ అధికారులకు, డీలర్లు ఏడీఏ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా చూడాలని, స్టాక్ రిజిస్టర్లు, బిల్ బుక్స్ రాయాలని, నకిలీ పత్తి విత్తనాలు, పురుగు మందులు వాడవద్దని డీలర్లకు సూచించారు. ఈ సమావేశంలో మండల వ్యవసాయ అధికారులు వీరన్న, పుష్పాల సృజన, ప్రశాంత్, యమున, భీమిని డివిజన్ ఏఈవోలు, డీలర్స్, తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన విత్తనాలు విక్రయించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ బానోత్ ప్రసాద్

మందమర్రిరూరల్, మే 15 : రైతులకు నాణ్యమైన విత్తనాలను విక్రయించాలని చెన్నూరు ఏడీఏ బానోత్ ప్రసాద్ అన్నారు. గురువారం మండలంలోని సండ్రోన్‌పల్లిలోని రైతు వేదికలో మండలంలోని విత్తన, ఎరువుల షాపుల డీలర్లతో సమావేశం నిర్వహించారు. మార్కెట్లో లైసెన్స్ ఉండి అన్ని అనుమతులున్న వ్యవసాయ ఉత్పత్తులు మాత్రమే విక్రయించాలన్నారు. కొనుగోలు చేసిన ప్రతి రైతుకూ రసీదు ఇవ్వాలని, స్టాక్ రిజిష్టర్ బిల్ బుక్ పెట్టుకుని వ్యాపారం చేయాలన్నారు. ప్రభుత్వ నియమాలు ఉల్లంఘించిన వారిపై చట్టరీత్య చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కిరణ్మయి, ఏఈవో ముత్యం తిరుపతి, రైతులు పాల్గొన్నారు.

## మౌలిక సదుపాయల కల్పనకు కృషి


గజ్జలపల్లిలో గ్రామస్తులతో మాట్లాడుతున్న అధికారులు

తాండూర్, మే 15 : గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ప్రాజెక్టు అధికారి ఐటీడీఏ ఊట్నూర్, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఆదేశాల మేరకు గురువారం పీవీటీజీ గ్రామమైన రేచిని గ్రామపంచాయతీ పరిధిలోని గజ్జలపల్లి హబిటేషన్‌లో గ్రామస్తులతో వారికి అవసరమైన మౌలిక సదుపాయాలపై అధికారులు చర్చించారు. ఈ సమావేశంలో గ్రామస్తులు భీమన్న దేవుడి కొరకు షెడ్డు అదేవిధంగా కమ్యూనిటీ హాలు, బోర్‌వెల్ కావాలని కోరారు. ఈ విషయంపై పూర్తి నివేదికను ఐటీడీఏ పీవోకు పంపిస్తామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్, ఎంపీడీవో శ్రీనివాస్, సీఐ కుమారస్వామి, అధికారులు, గ్రామస్తులు, తదితరులున్నారు.

## డిపాజిట్ చెల్లించాలి

నస్పూర్,మే 15 : జిల్లాలోని ప్రైవేట్ పాఠ్య పుస్తకాల విక్రయ యాజమానులు పుస్తకాలు విక్రయించడానికి రూ. 5 వేల డీడీని జిల్లా విద్యాశాఖ అధికారి మంచిర్యాల పేరు మీద డిపాజిట్ చెల్లించాలని డీఈవో యాదయ్య తెలిపారు. ఈ నెల 15 నుంచి 23వ తేదీ వరకు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డిపాజిట్ చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత

- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

నస్పూర్, మే 15 : రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత అని, ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు కచ్చితంగా పాటించాలని కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. గురువారం నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో డీసీపీ భాస్కర్, జిల్లా అటవీ అధికారి శివ్ ఆశిష్‌సింగ్, ఆర్డీవోలు శ్రీనివాసరావు, హరికృష్ణతో కలిసి పోలీసు, రవాణా, రోడ్లు, భవనాలు, జాతీయ రహదారుల అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి వాహనదారులకు తెలిసేలా వేగ నిరోధకాలు, వేగ పరిమితి, యూటర్న్, ఇతర సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలోని బోయపల్లి రోడ్డు నుంచి తాండూర్ వరకు, బెల్లంపల్లి ప్రభుత్వ దవాఖాన నుంచి హనుమాన్ విగ్రహం వరకు, నస్పూర్‌లోని కృష్ణ కాలనీ నుంచి దొరగారిపల్లె వరకు సర్వీసు రోడ్లు నిర్మించాలన్నారు. మంచిర్యాల పట్టణంలోని ఐబీ చౌరస్తా నుంచి మేదరివాడ, టీటీడీ కల్యాణ మండపం, రైల్వేస్టేషన్, లక్ష్మీ టాకీస్ చౌరస్తాల్లో సిగ్నల్స్, రేడియమ్స్ ఏర్పాటు చేయాలని, వారానికో రోజు వాహనాల తనిఖీలు చేయాలన్నారు. మార్కెట్ ఏరియాలో వాహనాల పార్కింగ్‌కు స్థలం ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### సమీకృత మార్కెట్‌ను వినియోగించుకోండి

తాండూర్/బెల్లంపల్లి, మే 15 : ప్రజలకు కూరగాయలు, మాంసపు ఉత్పత్తులను ఒకే చోట అందించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం చేపట్టిన సమీకృత కూరగాయల మార్కెట్‌ను వ్యాపారస్తులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం బెల్లంపల్లి మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావుతో కలిసి సమీకృత మార్కెట్‌లోని షాపుల కొరకు లబ్ధిదారులను లక్కీడ్రా పద్ధతి ద్వారా ఎంపిక చేశారు. సమీకృత కూరగాయల మార్కెట్‌లోని 31 షాపులకు నిర్వహించిన లక్కీడ్రా ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు కలెక్టర్ తెలిపారు. షాపులు పొందిన వ్యాపారులు నిబంధనలు పాటించాలని సూచించారు.

## యాక్సిడెంట్ స్పాట్‌ల గుర్తింపు


రోడ్డు దాటకుండా రైలింగ్‌తో పూర్తిగా మూసి వేస్తున్న సిబ్బంది

మందమర్రి, మే 15: నాలుగు వరుసల జాతీయ రహదారిపై తరచూ సంభవిస్తున్న రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసులు, ఎన్‌హెచ్ఏఐ అధికారులు చర్యలు చేపట్టారు. మందమర్రి సీఐ శశీధర్ రెడ్డి, ఎస్ఐ రాజశేఖర్‌లు ఎన్‌హెచ్ఏఐ అధికారులతో సమీక్షించారు. యాపల్ ఏరియాలో వారం క్రితం సీఐ, ఎస్ఐలు ప్రజలతో సమావేశం నిర్వహించి అవగాహన కల్పించారు. నాలుగు వరుసల జాతీయ రహదారిని ప్రజలు దాటకుండా వేసిన రైలింగ్స్‌లో గ్యాపులు ఉండడంతో ప్రజలు రోడ్డు దాటుతున్న క్రమంలో ప్రమాదాలు జరుగుతున్నాయని గుర్తించారు. దీంతో రోడ్డు ఇరువైపులా ఉన్న రైలింగ్‌ను గురువారం మూసి వేశారు. ఈ సందర్భంగా సీఐ శశీధర్ రెడ్డి, ఎస్ఐ రాజశేఖర్ మాట్లాడుతూ గతేడాదిలో రైలింగ్స్ సందుల నుంచి ప్రజలు రోడ్డు దాటడంతో ప్రమాదాలు జరిగి ఆరుగురు మరణించినట్లు తెలిపారు. నిర్దేశిత ప్రదేశాల్లో తప్ప రోడ్డును దాటరాదని సూచించారు. దూర ప్రాంతం నడిచి వెళ్లాల్సి వస్తుంది. బెల్లంపల్లి వైపు వెళ్లాలన్నా తిరిగి రావాలన్నా తాము రోడ్డును దాటాల్సి ఉంటుందని రోడ్డు దాటేందుకు సుమారు రెండు కిలోమీటర్ల దూరం నడవాల్సి వస్తుందని, లేదా ఆటోలో వెళ్లి రోడ్డు దాటి బస్ షెల్టర్ వద్దకు చేరుకోవాల్సి వస్తుందని యాపల్ ఏరియా ప్రజలు వాపోతున్నారు. జాతీయ రహదారిపై నుంచి వంతెన నిర్మించాలని పలు మార్లు కోరినా వినతి పత్రాలు సమర్పించినా ఎన్‌హెచ్ఏఐ అధికారులు పట్టించుకోవడం లేదని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎండీ అబ్బాస్ తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వంతెనను నిర్మించాలని కోరారు.

# డెంగ్యూ వ్యాధిని నిర్మూలిద్దాం

- మంచిర్యాల డీఎంహెచ్‌వో హరీశ్ రాజ్



పోస్టర్ విడుదల చేస్తున్న డీఎంహెచ్‌వో, వైద్యాధికారులు

మంచిర్యాల అర్బన్, మే 15: ఈ నెల 16న జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా జిల్లాలో వ్యాధి నిర్మూలనలో భాగంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మంచిర్యాల డీఎంహెచ్‌వో హరీశ్ రాజ్ అన్నారు. గురువారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో అవగాహన ఫ్లెక్సీలు, పోస్టర్లు, కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని ఆయుష్మాన్ ఆరోగ్య, ఉప, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో గ్రామాల్లో ఆశ, అంగన్వాడీ, ఆరోగ్య కార్యకర్తల సమన్వయంతో అవగాహన కార్యక్రమాలను చేపట్టాలని పేర్కొన్నారు. మన జిల్లాలో ఈ ఏడాది 42 మందికి రక్త నమూనాలు పరీక్ష చేయగా రెండు పాజిటివ్‌లు నమోదైనట్లు తెలిపారు. ఇంటి పరిసరాల్లో మురుగు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. దోమతెరలు వాడాలని చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణులపై శ్రద్ధ చూపాలని కోరారు. డెంగ్యూ వ్యాధి సోకితే భయపెట్టడం ప్లేట్‌లెట్స్ తగ్గాయని భయపెట్టడం లాంటివి చేయవద్దని ప్రైవేట్ దవాఖానల వైద్యులకు ఆదేశాలిచ్చినట్లు తెలిపారు. ఎలిజా టెస్ట్ తర్వాతనే డెంగ్యూ నిర్ధారణ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఉప జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.అనిత, డా.కృపాబాయి, డా.సీతారామ రాజు, డా.అనిల్ కుమార్, వైద్యులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## దరఖాస్తుల స్వీకరణ

నస్పూర్, మే 15 : 2025-26 విద్యా సంవత్సరానికి గాను ప్రైవేట్ కళాశాలలో ఇంటర్‌తో ఎంసెట్ కోచింగ్ (కార్పొరేట్) ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉప సంచాలకులు పోటు రవీందర్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి 10వ తరగతి వార్షిక పరీక్షల్లో 7జీపీఏ ఆపై ఫలితాలు సాధించిన షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, వెనకబడిన తరగతులు, ఈబీసీ, మైనార్టీ దివ్యాంగ విద్యార్థులు ఈ నెల 17వ తేదీ నుంచి 31వ తేదీలోగా ఆన్‌లైన్‌లో వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. 10వ తరగతిలో మెరిట్ ఆధారంగా విద్యార్థులకు ఆన్‌లైన్ ద్వారా ప్రవేశం కల్పిస్తామని తెలిపారు.

## ఫార్మసీ ఆఫీసర్లకు శిక్షణ కార్యక్రమం

నస్పూర్, మే 15 : మంచిర్యాలలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో గురువారం ఫార్మసీ ఆఫీసర్లకు కుటుంబ నియంత్రణకు సంబంధించిన కుటుంబ సంక్షేమ కార్యక్రమాలపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా కుటుంబ నియంత్రణ పద్ధతులు, నిరోధ్, అంతర ఇంజక్షన్లను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు అర్హులైన దంపతులకు అందజేసేందుకు ఇండెంట్ నమోదు చేయడం, ఖర్చు చేయడం వంటి వివరాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కృపాబాయి, ప్రోగ్రాం ఆఫీసర్ కాంతారావు, ఎస్‌వో సీతారామరాజు, ప్రశాంతి, ప్రవళిక, డాక్టర్లు కృష్ణతేజ, ఫార్మసీ ఆఫీసర్ శంకర్, వెంకటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.


## బీఆర్ఎస్ తెచ్చిన పనులకు శంకుస్థాపన చేసేందుకు పదహారు నెలలా ?

- బీఆర్ఎస్ భీమారం మండల అధ్యక్షుడు కలగూర రాజ్‌కుమార్


మాట్లాడుతున్న కలగూర రాజ్‌కుమార్, బీఆర్ఎస్ నాయకులు

భీమారం, మే 15 : గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ తెచ్చిన పనులకు శంకుస్థాపనకు ఇప్పటి ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామికి పదహారు నెలల సమయం పట్టిందా ? బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కలగూర రాజ్ కుమార్ ధ్వజమెత్తారు. భీమారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులతో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మండలంలోని నర్సింగాపూర్ గ్రామంలో బాల్క సుమన్ సబ్ స్టేషన్‌ను తీసుకవస్తే దానికి భూమి పూజ చేసి విడిచిపెట్టారని, ఇటీవల బూర్గుపల్లి గ్రామం నుంచి మొదలు కొని గెర్రె గూడెం మీదుగా దాంపూర్ వరకు గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం తెచ్చిన పనులకు కాంగ్రెస్ నాయకులతో పోయి వివేక్ వెంకటస్వామి భూమి పూజలు చేశారని తెలిపారు. మీ కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ నియోజకవర్గాల్లో కంపెనీలు పెట్టావని, వాటిని చెన్నూర్ నియోజకవర్గంలో ఇక్కడి యువతకు ఉద్యోగావకాశాలు దక్కేవని తెలిపారు. మొదటి నుంచి చెన్నూర్‌ను దోచుకోవడం తప్పా వివేక్ ఫ్యామిలీ ఇక్కడ చేసిందేమీ లేదని ఆరోపించారు. చెన్నూర్ నియోజకవర్గానికి ఏమీ చేశారో కాంగ్రెస్ నాయకులపై చెప్పాలని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఆత్కూరి రాము, వీరాగోణి రమేశ్ గౌడ్, దాసరి మణిదీపక్, వడ్ల కొండ పవన్, సుంకరి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్పీని కలిసిన దహెగాం ఎస్ఐ


ఎస్పీకి మొక్కను అందజేస్తున్న ఎస్ఐ విక్రమ్

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, మే 15: దహెగాం నూతన ఎస్ఐ విక్రమ్ గురువారం జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ డీవీ శ్రీనివాసరావును మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్క అందజేశారు. నిబద్ధతతో విధులు నిర్వహించాలని ఎస్పీ సూచించారు.

# మున్నూరుకాపులు ఐక్యంగా ఉండాలి

- జనగణనలో తమ కులాన్ని 5వ స్థానంలో చూపించారు
- రాష్ట్ర అధ్యక్షుడు కొండా దేవయ్య



మున్నూరు కాపు ప్రపంచ మహా సభ పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

శ్రీరాంపూర్, మే 15 : తెలంగాణాలో అత్యధిక జనాభా ఉన్న మున్నూరు కాపులు ఒకే కులం.. ఒకే సంఘంగా ఐక్యమవుదామని తెలంగాణా మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండా దేవయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ బోరిగం రాజారాం పేర్కొన్నారు. గురువారం నస్పూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమవేశంలో వారు మాట్లాడారు. తెలంగాణా వ్యాప్తంగా ఎన్నికల ద్వారా 12 వేల గ్రామాలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, జిల్లా కమిటీలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. రాష్ట్రంలో ఉన్న బీసీల్లో 18 శాతం(40 లక్షల మంది)తో మొదటి స్థానంలో ఉన్న తమను కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన జనగణనలో తమ కులాన్ని 5వ స్థానంలో చూపించారని ఆరోపించారు. మున్నూరు కాపులకు కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.500 కోట్లు కేటాయించాలని, ప్రోత్సాహక రుణాలివ్వాలని డిమాండ్ చేశారు. మున్నూరు కాపు ఆత్మగౌరవ భవనం నిర్మాణానికి రూ.10 కోట్లు కేటాయించాలన్నారు. తెలంగాణా క్యాబినెట్‌లో మున్నూరు కాపులకు మంత్రి పదవి ఇవ్వాలని కోరారు. తెలంగాణా మున్నూరు కాపులకు పటేల్‌గా గెజిట్ విడుదల చేయాలన్నారు. అనంతరం ఆమెరికాలో ఆగష్టు 30, 31న నిర్వహించే గ్లోబల్ మున్నూరు కాపు సభ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సమావేశంలో మున్నూరు కాపు సంఘం మంచిర్యాల నియోజకవర్గం అధ్యక్షుడు పల్లె భూమేశ్, జిల్లా గౌరవ అధ్యక్షుడు గొంగళ్ల శంకర్, కన్వీనర్ ఆకుల సత్తన్న, జిల్లా అధికార ప్రతినిధి భాస్కర్ల రాజేశం, నస్పూర్ మండల సమన్వయ కమిటీ సభ్యులు మైదం రామకృష్ణ, గుడాల మల్లేశ్, రాళ్ల బండి రాజన్న, పూదరి కుమార్, చెన్నూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి బోరిగం వెంకటేశం, నాయకులు బొడ్డు చిన్నయ్య, సమ్మయ్య, విశాల్, కర్నె శ్రీనివాస్ పాల్గొన్నారు.

## పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, మే 15: నిధుల దుర్వినియోగానికి పాల్పడిన రెబ్బెన మండలం కొండపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎం.నమృత (అప్పటి ఇందిరానగర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి)ని విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు డీపీవో భిక్షపతి తెలిపారు. ఇందిరానగర్ గ్రామ పంచాయతీలో పింఛన్‌దారుల్లో చనిపోయిన వారి పేర్లు తొలగించకుండా వృద్ధాప్య పింఛన్లు రూ.24,192, దివ్యాంగ పింఛన్లు రూ.48,192ను పంచాయతీ కార్యదర్శి వేలిముద్రతో విత్‌డ్రా చేశారని తెలిపారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి విచారణ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## జ్యోతిబాపూలే దంపతుల విగ్రహాల ఆవిష్కరణ


పూలే దంపతులు విగ్రహాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

కౌటాల, మే 15 : మహాత్మా జ్యోతి బాపూలే- సావిత్రీ బాయి పూలే విగ్రహాలను మాలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు-బీఆర్ఎస్ తాలూక కన్వీనర్ లెండుగురే శ్యామ్‌రావు గురువారం మండలంలోని కన్నెపల్లి క్రాస్ రోడ్డు వద్ద ఆవిష్కరించారు. అందరికీ విద్యాభ్యాసం, బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించిన మహనీయులు మహాత్మా జ్యోతి బాపూలే సావిత్రీబాయిపూలే అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఆదె వసంత్ రావు, మండల అధ్యక్షుడు గంగారాం, మండలంలోని మాలీ సంఘం నాయకులు భారీగా పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి


పోస్టర్ విడుదల చేస్తున్న జిల్లా రవాణా శాఖ అధికారులు

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, మే 15: రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని జిల్లా రవాణా శాఖ అధికారి రామచందర్ అన్నారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని ఆర్టీవో కార్యాలయంలో గురువారం ఎంవీఐ మోహన్, రాయమల్లుతో కలిసి పాఠశాలలు, కళాశాలల యజమానులు, డ్రైవర్లు, సహాయకులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరీక్షల సహాయ కమిషనర్ ఉదయ్‌బాబు, ట్రాస్మ అధ్యక్షుడు దేవభూషణం, తిరుపతిచారి, సంజీవ్, గోపాల్, సుదర్శన్‌గౌడ్, రాధాకృష్ణచారి, మాలిక్, నరేందర్‌కుమార్, తదితరులున్నారు.

## మహిళా చట్టాలపై అవగాహన ఉండాలి


మాట్లాడుతున్న షీ టీం సభ్యులు

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, మే 15: మహిళల చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని షీ టీం ఆసిఫాబాద్ డివిజన్ బృందం సభ్యులు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని జడ్పీ బాలికల పాఠశాలలో ప్రైమరీ స్కూల్ టీచర్లకు మహిళల రక్షణ, షీ టీం అందిస్తున్న సేవలను వివరించారు. ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తిస్తే వెంటనే 8712670564 కి సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో షీ టీం సభ్యులు స్వప్న, రజిని, దినేశ్, ప్రధానోపాధ్యాయురాలు శ్రీలత ఉన్నారు.

## స్పోర్ట్స్ సర్టిఫికెట్ కోర్సుకు ఎంపిక

కౌటాల, మే 15 : మండలంలోని తుమ్మిడిహట్టి గ్రామానికి చెందిన పోరెత్ భరత్ స్పోర్ట్స్ ఆథారిటీ ఆఫ్ ఇండియా నేతాజీ సుభాష్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్ పట్యాల పంజాబ్‌లో సర్టిఫికెట్ కోర్సు ఇన్ స్పోర్ట్స్ కోచింగ్‌కు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ రవి కుమార్ తెలిపారు. ప్రస్తుతం భారత్ ఖమ్మం కాకతీయ యూనివర్సిటీ పీజీ కళాశాలలో వ్యాయామ విద్యలో రెండవ సంవత్సరం చదువుతున్నాడు. స్పోర్ట్స్ సర్టిఫికెట్ కోర్సుకు ఎంపిక కావడంతో భరత్‌ను కళాశాల కోచ్‌లు కోటయ్య, మధు, శ్రీనివాస్, జిల్లా అథ్లెటిక్ కోచ్ విద్యాసాగర్ అభినందించారు.

## మంత్రుల పర్యటనకు ఏర్పాట్ల పరిశీలన

పెంచికల్ పేట్,మే15 : మండల కేంద్రంలో నేడు నిర్వహించే భూభారతి రెవెన్యూ సదస్సులో భాగంగా రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ దండె విఠల్, జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, జిల్లా లోని వివిధ శాఖల అధికారులు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సభ ఏర్పాట్లను పరిశీలించి, అధికారులకు దిశా నిర్దేశం చేశారు. హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలించారు. అనంతరం సమావేశం నిర్వహించి వివిధ శాఖల అధికారులకు ఏర్పాట్ల నిర్వహణపై పలు సూచనలు ఎస్పీ శ్రీనివాసరావు బందోబస్తు ఏర్పాట్లపై పోలీసు అధికారులకు సూచనలు చేశారు.

## నలుగురిపై కేసు నమోదు

తిర్యాణి, మే 15 : మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం గంభీరావుపేటకు చెందిన దర్వాజల రాజమల్లు గుడుంబా తయారీ చేస్తుండగా అతనిని పట్టుకున్నామని అదే గ్రామానికి చెందిన దేవుసాని శంకర్ తన టాటా ఏస్ వాహనంలో 25 లీటర్ల నాటు సారాను తరలిస్తుండగా పట్టుకొని విచారించగా బింగి లక్ష్మికి చెందినదిగా తెలిపారని పేర్కొన్నారు. నాటు సారాతో పాటు టాటా ఏస్ వాహనాన్ని స్వాధీనం చేసుకొని దేవుసాని శంకర్, బింగి లక్ష్మి, టేకెన్ కిషన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు

## లైంగికదాడికి యత్నం కేసులో నిందితుడికి పదేళ్ల జైలు

కౌటాల, మే 15 : మండలంలోని గుండాయిపేటకు చెందిన చాప్లె చందుకు పదేళ్ల కఠిన కారాగార శిక్షతోపాటు రూ.40 వేల జరిమానాను ఆసిఫాబాద్ జిల్లా సెషన్ కోర్టు న్యాయమూర్తి ఎంవీ రమేశ్ గురువారం విధించినట్లు ఎస్ఐ గుంపుల విజయ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం..2022 సెప్టెంబర్‌లో గుండాయిపేటకు యువతిపై అదే గ్రామానికి చెందిన చాప్లె చందు బలత్కారానికి యత్నించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ ప్రవీణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గురువారం పీపీ జగన్‌మోహన్ రావు పూర్తి సాక్ష్యాధారాలను ప్రవేశపెట్టినట్లు ఆయన తెలిపారు. నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన కోర్టు హెడ్ కానిస్టేబుల్ బాబాజీని న్యాయమూర్తి అభినందించినట్లు ఎస్ఐ విజయ్ తెలిపారు.